
వెదురుకుప్పం మండలం రెంటాలచేనులో రామకృష్ణారెడ్డి ఇల్లు



పద్మశ్రీ అందుకున్న రైతుబిడ్డ

నివాళి

- భాషా శాస్త్రవేత్త బండి రామకృష్ణారెడ్డి సేవలను గుర్తు చేసుకుంటున్న విద్యావేత్తలు
- హైదరాబాదులో కన్నుమూసిన వెదురుకుప్పం ప్రాంత వాసి
- ద్రావిడ వర్సిటీ తొలి రిజిస్ట్రార్‌గా సేవలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో బుధవారం కన్నుమూసిన వెదురుకుప్పం ప్రాంతానికి చెందిన భాషా శాస్త్రవేత్త పద్మశ్రీ బండి రామకృష్ణారెడ్డి సేవలను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం తొలి రిజిస్ట్రార్‌గానూ చేసిన ఆచార్య బండి రామకృష్ణారెడ్డి(84) కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాదులోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అక్కడే ఆఖరి శ్వాస విడిచారు. ఈయన స్వస్థలం వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీలోని రెంటాలచేను. వీరిది వ్యవసాయ కుటుంబం. పల్లెలో ప్రాథమిక బడికూడా లేక పోవడంతో కాపుమొండివెంగనపల్లెలో అమ్మమ్మ ఇంట్లో ఉంటూ వెదురుకుప్పంలో పదో తరగతి వరకు చదువుకున్నారు. కార్వేటినగరంలో ఇంటర్ చదువుతున్న రోజుల్లో గణిత అధ్యాపకుడు కార్వేటినగరం నివాసి డాక్టర్ అరుణాలం ప్రోత్సాహం ఈయనకు దారి చూపింది. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ(హిందీ) చదివారు. పుణెలోని డెక్కన్ కాలేజీలో ఎంఏ భాషా శాస్త్రం చదివారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలు అన్నామలై విశ్వవిద్యాలయంలోనూ, సీఐఐఎల్ (మైసూర్) లోనూ పనిచేశారు. అనంతరం కామన్వెల్త్ ఫెలోషిప్‌పై యూకే వెళ్లి ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో అండర్సన్ కేస్ గ్రామర్‌పై పీహెచ్‌డీ చేశారు. చంద్రగిరి మండలం రంగంపేటకు చెందిన కె.నాగమ్మతో వివాహం జరిగింది. ఆమె కూడా ప్రొఫెసర్‌గా చేశారు. 2008లో ఆమె చనిపోయారు. 1977లో ఉస్మానియా యూనివర్సిటీ భాషా శాస్త్ర విభాగంలో లెక్చరర్‌గా చేరి, తరువాత ప్రొఫెసర్ అయ్యారు. 1990లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి రిజిస్ట్రార్‌గానూ పనిచేశారు. కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం స్థాపించినపుడు తొలి రిజిస్ట్రార్‌గా సేవలను అందించారు. ఆ సమయంలో గురువు అరుణాచలం ఈ యూనివర్సిటీ వీసీగా ఉన్నారు. ఆచార్య బండి రామకృష్ణారెడ్డి అనేక గిరిజన భాషలపై విశేష కృషి చేశారు. 'ఇంది-ఆవే'భాషకు లిపి తయారు చేశారు. భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. ఈయన మేనల్లుడు డాక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్యుడిగా ఉన్నారు. స్వస్థలంవీడి ఈ కుటుంబం దశాబ్దాల కిందటే వెళ్లిపోయినా వెదురుకుప్పం ప్రాంతంలో వీరికి బంధువర్గం ఉంది. వీరి మృతి పట్ల ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

ద్రావిడ వర్సిటీకి రామకృష్ణారెడ్డి సేవలు ఎనలేనివి

గుడుపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి తొలి రిజిస్ట్రార్‌గా పనిచేసిన పద్మశ్రీ రామకృష్ణారెడ్డి సేవలు ఎనలేనివని ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి తెలిపారు. గురువారం ద్రావిడ వర్సిటీలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట రామకృష్ణారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఇన్‌చార్జి వీసీతోపాటు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, డీన్ ఆచార్య శ్యామల, అధ్యాపకులు, ఉద్యోగులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. పలువురు ఉద్యోగులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


రామకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దొరస్వామి తదితరులు



తిరుమలలో మీనాక్షి

హీరోయిన్ మీనాక్షి చౌదరి గురువారం సుప్రభాతసేవలో పాల్గొని తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు జనం ఎగబడ్డారు. ప్రస్తుతం నాగచైతన్య, నవీన్ పోలిశెట్టి సినిమాల్లో నటిస్తున్నట్లు మీనాక్షి చౌదరి తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మన్నించు ముక్కంటీశా..!

- వసూళ్ల కేంద్రంగా శ్రీకాళహస్తీశ్వరాలయ శయనమందిరం


ఆలయంలోని శయనమందిరం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల పవిత్రమైన శయన మందిరాన్ని కొందరు అక్రమార్కులు వసూళ్ల కేంద్రంగా మార్చుకున్నారు. ప్రతిరోజు ఆలయంలో స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు తెర వేసిన తర్వాత ఏకాంత సేవ నిర్వహిస్తుంటారు. ముందుగా మూలమూర్తులకు తెరవేసిన తరువాత స్వామి అమ్మవార్లను వెండిపల్లకీలో కొలువుదీర్చి ఆలయంలో ప్రాకారంగా ఊరేగిస్తారు. ఆ తరువాత స్వామి అమ్మవార్లు అమ్మవారి సన్నిధిలోని శయనమందిరం వద్దకు చేరుకుంటారు. శయనపాన్పు సుందరంగా సుగంధ పరిమళాలు వెదజల్లేపుష్పలతో అలంకరించి స్వామి అమ్మవార్లను కొలువుదీర్చుతారు. రాత్రి అక్కడ మళ్లీ నైవేద్య హారతులు సమర్పించి శయనమందిరంలో స్వామి అమ్మవార్లను ఏకాంతంగా నిద్రపుచ్చుతారు. ఆ తరువాత భక్తులందరిని వెలుపలకుపంపి ఆలయం మూసివేస్తారు. తిరిగి మరుసటిరోజు ఉదయం శయనమందిరం వద్ద సుప్రభాతం, గోపూజ నిర్వహించి స్వామి అమ్మవార్లను మేకొల్పుతారు. ఆపై స్వామి అమ్మవార్లు వారి గర్భాలయాలకు చేరుకున్న తరువాత మూలమూర్తుల దర్శనం ఆరంభమవుతుంది. రోజు స్వామి అమ్మవార్లు శయనించే పాన్పును పరమపవిత్రంగా భావించాలి. కానీ అమ్మవారి గర్భగుడి ఎదుటే ఉన్న శయనమందిరాన్ని పగలు మొత్తం యథేచ్ఛగా తెరచి ఉంచుతున్నారు. అంతే కాకుండా శయనమందిరంలోకి భక్తులు వచ్చి దక్షిణ సమర్పించాలంటూ బాహాటంగా చప్పట్లు కొట్టి మరీ పిలుస్తున్నారు. గురువారం ఓ సెక్యూరిటీగార్డు అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను ముందుగా శయనమందిరంలోకి వెళ్లాలంటూ అరచి చెప్పడంపై కొందరు భక్తులు నిలదీశారు. పవిత్రమైన శయనపాన్పును భక్తులందరూ లోపలకు వెళ్లి స్పృశించడం శిరస్సుతో తాకి మొక్కడంపై కొందరు భక్తులు విస్మయం వ్యక్తం చేశారు. శయనపాన్పు పక్కనే కొందరు నిలబడి భక్తుల నుంచి నగదు వసూలు చేయడం గమనార్హం. ఈ శయన పాన్పు దందా రెండేళ్ల క్రితం విచ్చలవిడిగా జరిగేది. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలతో ఆ దందాకు స్వస్తిపడింది.మళ్లీ కొద్దిరోజులుగా పాత విధానానికి కొందరు అక్రమార్కులుతెరతీశారు. సంబంధిత అధికారులు స్పందించి కట్టడి చేయాల్సిందిగా భక్తులు కోరుతున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

- మే 2వ తేదీ రాత్రి 11.59 వరకు గడువు
- మే 18న పరీక్షలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభించి మే 2వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినవారు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌లు ఐఐటీ కాన్పూర్ ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఆ మేరకు అభ్యర్థులు కాన్పూర్ ఐఐటీ అధికారిక వెబ్‌సైట్ jeeadv.ac.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. మే 2వ తేదీ రాత్రి 11.59 గంటలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని ఎన్టీఏ పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళా అభ్యర్థులు రూ.1,600, ఇతర జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 3,200 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మే 18వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరుగనున్నాయి.

లక్షల్లో జీతాలు తీసుకొంటున్నారు
పేదలకు సరైన వైద్యం అందించలేరా?

- పీహెచ్‌సీ వైద్యులను ప్రశ్నించిన కలెక్టర్ వెంకటేశ్వర్


కాన్పుల గదిలోని వార్మర్ పరికరం వాడే విధానం తెలుసా అంటూ వైద్యులు చంద్రిక, చైతన్యను ప్రశ్నిస్తున్న కలెక్టర్

దొరవారిసత్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'రూ.లక్షల్లో జీతాలు తీసుకొంటున్నారు. పేదలకు సరైన వైద్యం అందించ లేరా? మీ పనితీరు సరిగా లేదు. పద్ధతి మార్చుకోండి' అంటూ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దొరవారిసత్రం పీహెచ్‌సీ వైద్యులను హెచ్చరించారు. గురువారం ఆయన ఆస్పత్రిని తనిఖీ చేశారు. ల్యాబొరేటరీలోని పరికరాలను పరిశీలించారు. వీటిని చూసుకొంటుంటారా.. ఉపయోగించరా అంటూ ప్రశ్నించారు. ఫార్మశిలోని మందులను చూశారు. కాన్పుల గదిలోకి వెళ్లిన ఆయన ఇంత మంచి వసతి పెట్టుకొని కాన్పులు ఎందుకు చేయడం లేదని వైద్యురాలు చంద్రికను ప్రశ్నించారు. పుట్టిన బిడ్డను ఉంచే వార్మర్ పరికరాన్ని చూసిన కలెక్టర్.. దీనిని వాడే విధానం మీకు తెలుసా అంటూ డాక్టర్లు చంద్రిక, చైతన్యను అడిగారు. వారి నుంచి సమాధానం రాకపోవడంతో బేబి పుట్టిన వెంటనే ఉంచే వార్మర్ గురించీ తెలియక పోతే మీరేం వైద్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంచి కళాశాలల్లో చదివి ప్రభుత్వం ఉద్యోగం వచ్చిన తర్వాత వృత్తిని మరిచిపోయారా అంటూ మండిపడ్డారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి రోగికి మంచి వైద్యం అందేలా మీలో మార్పులు రావాలని కోరారు. ఈ ఆస్పత్రిని తరచూ తనిఖీ చేయాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయికి సూచించారు. జిల్లా వైద్యాధికారులతోనూ మాట్లాడి సరిచేయాలన్నారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మంగళం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వితంతు పింఛన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో సామాజిక భద్రత పింఛన్లు పొందుతూ ఏదేని కారణంతో మరణిస్తే అతని భార్యకు ఇచ్చే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. భర్త, భార్య ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, పింఛను పుస్తకం, భర్త మరణ ధృవీకరణ పత్రం జిరాక్సు కాపీలను జతచేసి, శనివారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూన్ నుంచి పింఛన్లు మంజూరయ్యే అవకాశముందని వెల్లడించారు.

జగన్ విధానాలపై విచారణ జరగాల్సిందే

- పహల్గాం దాడిపై దర్యాప్తు చేపట్టాలి
- సీపీఎం నేత మధు



తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సీఎంగా జగన్ విద్యుత్ రంగంలో చేసిన విధానాలపై (విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై) విచారణ జరగాల్సిందేనని సీపీఎం నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు మధు డిమాండు చేశారు. ప్రస్తుతం విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో సమూల మార్పులు జరగాలంటే వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం తప్ప వేరే మార్గం లేదని పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయ విధానాల కోసం మే 20న నిర్వహించే సమ్మెకు ప్రజలు మద్దతివ్వాలని కోరారు. సత్యవేడు ఎస్ఈజెడ్‌లో రైతుల అంగీకారంతోనే భూములు తీసుకోవాలన్నారు. తిరుపతికి సమీపంలోని శెట్టిపల్లి భూముల సమస్యను వెంటనే పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. హామీల అమలులో ప్రభుత్వం వెనుకబడిందని ఆరోపించారు. పహల్గాం దాడిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. ఈ దాడిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని రూపుమాపుతామని చెప్పిందని, పరిస్థితిని బట్టి చూస్తే ఉగ్రవాదం అలానే ఉందనిపిస్తోందన్నారు. ఉగ్రవాద చర్యలను ప్రజలంతా ఖండిస్తున్నారని, కొన్ని రాజకీయ పార్టీలు ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాయని వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు కందారపు మురళి, వందవాసి నాగరాజు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు




పవన్ కల్యాణ్ నుంచి పురస్కారం అందుకుంటున్న సుశీలాదేవి, రామ్మోహన్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన అధికారులు, ఉద్యోగులకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉత్తమ పురస్కారాలు అందజేశారు. గురువారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో పన్ను వసూళ్లలో ప్రతిభ కనబరచిన జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి సుశీలాదేవి.. పల్లె పండుగ అమలులో ప్రతిభ కనబరచిన డీపీఆర్ ఈవో (పంచాయతీరాజ్ ఎస్ఈ) రామ్మోహన్.. ఉపాధి హామీ పథకంలో ఉత్తమ సేవలు అందించిన ఫీల్డ్ అసిస్టెంట్ బాలరాజు పురస్కారాలు అందుకున్నారు. వీరిని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు.

పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 30న నిర్వహించనున్న పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల చేసినట్టు సాంకేతిక విద్యా శాఖ, శిక్షణ బోర్డు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులు ఏపీ పాలీసెట్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని, పోస్టులేదా ఇతర ఆఫ్‌లైన్ మార్గాల్లో పంపబోమని స్పష్టం చేసింది.విద్యార్థులు ముందుగానే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

పహల్గాం 'ఉగ్ర'దాడితో
తిరుపతి, తిరుమలలో హై అలర్ట్

- ఘాట్లలో ముమ్మరంగా కూంబింగ్


తిరుపతిలో వాహనాలు తనిఖీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పోలీసులు, టీటీడీ విజిలెన్సు అప్రమత్తమైంది. తిరుపతి, తిరుమలలో భద్రత కట్టుదిట్టం చేశారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, విష్ణునివాసం, మాధవం, అన్ని ఆలయాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుమానం ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు కట్టుదిట్టం చేశారు. తిరుపతిలోని అన్ని రోడ్లు, ముఖ్య కూడళ్లలో బాంబు, డాగ్ స్క్వాడ్లు తనిఖీలు చేస్తున్నాయి. ఇప్పటికే బాంబు నిర్వీర్యం చేసే దళాలు రంగంలోకి దిగి లాడ్జీలు, కొన్ని భవనాలు పరిశీలిస్తున్నారు. ఆలయాల వద్ద భద్రత పెంచారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇలాంటి తనిఖీలు మరో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు. తిరుపతి, తిరుమలలో మొత్తం 75 ప్రాంతాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇక, అలిపిరి చెక్ పాయింట్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. రెండు ఘాట్ రోడ్లలో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఘాట్‌లోని లింకు రోడ్డులో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేసి పంపుతున్నారు. టీటీడీ సీవీఎస్‌వో ఎస్పీ హోదాలో ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుమల భద్రతపై అన్ని శాఖల అధికారులతో సమీక్షించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



తిరుమలలో సీసీ కెమెరా పనితీరు పరిశీలన - ఘాట్ లింక్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చంద్రగిరి

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



రామచంద్రాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర మాదిగ అన్నారు. నెత్త కుప్పం మాదిగపల్లిలో గురువారం ఎస్సీ వర్గీకరణ సంబరాలను జరుపుకొన్నారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాజేంద్ర మాట్లాడుతూఎస్సీ వర్గీకరణకు అండగా నిలిచిన ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లేపల్లి దేవరాజులు, గురవయ్య, మునిరత్నం, నాదముని, లక్ష్మయ్య, చెంగల్రాయులు, వరదయ్య, రామచంద్రయ్య, మునిక్రిష్ణయ్య, భాస్కర్, మాధవరావు, చెంగమ్మ, రాణెమ్మ, తులసమ్మ, జోతమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపీడీవో రాధమ్మ

రామచంద్రాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో ఇందిరమ్మ అన్నారు. గురువారం సి.రామాపురం పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలో ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యంరెడ్డి, టీడీపీ సీనియర్‌నాయకుడు కొట్టే నరసింహారెడ్డి మాట్లాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులు, సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి, మునిరామిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, రంజిత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాల ప్రారంభం



దామలచెరువులో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పులివర్తి సుధారెడ్డి

పాకాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు, రవణయ్యగారిపల్లె గ్రామాల్లో గురువారం ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని నైపుణ్యంతో స్వయం సమృద్ధి సాధించాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, సర్పంచ్ సునీత, ఈవోపీఆర్డీ శశిరేఖ, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, కె.సావిత్రి, నాయకులు కె.సుధాకరయ్య, మర్యాదనాయుడు పాల్గొన్నారు.

శ్రీవారిమెట్టు వద్ద వేడుకగా మెట్ల పూజ



చంద్రగిరి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు వద్ద గురువారం ఉదయం వేడుకగా మెట్ల పూజను నిర్వహించారు. దక్షిణ భారతదేశ గోవింద యాత్ర వాట్సాప్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ పూజ జరిగింది. ఈసందర్భంగా శ్రీకాకుళానికి చెందిన మహంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడుగురు సభ్యులతో మొదలైన తమ గ్రూప్ నేటికి 1024 మందికి చేరిందన్నారు. ఆరేళ్లలో 485 సార్లు పాదయాత్రగా వచ్చి శ్రీవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. 1400 కిలోల పసుపు, 700 కిలోల కుంకుమతో శ్రీవారిమెట్టుకు పూజ చేయనున్నట్లు పేర్కొన్నారు. తొలుత కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నాక మెట్ల పూజ చేస్తూ ఈ భక్త బృందం తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లింది.

ఉపాధ్యాయులకు గ్రామస్థుల సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గుణశేఖర్

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి దోహదపడిన ఎర్రావారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను గురువారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ హైస్కూలులో ఈదఫా టెన్త్ పరీక్షలు రాసిన వారందరూ ఉత్తీర్ణులయ్యారు. దీనివెనుక పాఠశాల ఉపాధ్యాయుల అనితర కృషి ఉంది . దీనిని గుర్తించిన విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామస్థులు,పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు గురువారం సన్మానించారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ గుణశేఖర్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, ఉపాధ్యాయులు జగదీష్,అమరనాథ, సదాశివరెడ్డి, వెంకట్రామణ, గోవిందయ్య తదితరులను సత్కరించారు.

చంద్రగిరి ఏఎంసీ డైరెక్టర్‌గా నాగరాజు



ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ(ఏఎంసీ) డైరెక్టర్‌గా మండలానికి చెందిన కుంబా నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు అధికారులు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. టీడీపీలో చురుకుగా వ్యవహరించే ఈయన నియామకం పట్ల ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే పులివర్తి నానికి నాగరాజు ధన్యవాదాలు తెలిపారు.

చెవిరెడ్డివి నిరాధార ఆరోపణలు : టీడీపీ



మాట్లాడుతున్న శివకుమార్,పార్టీ నాయకులు

భాకరాపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నాని నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చిన్నగొట్టిగల్లు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ విమర్శించారు. చిన్నగొట్టిగల్లులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. గత ప్రభుత్వ హయాంలో చెవిరెడ్డిఅన్ని శాఖల నుంచి కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ఇసుక, మట్టి అక్రమ రవాణా ద్వారా భారగాగా ఆర్జించారన్నారు. అవినీతికి పాల్పడకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఎమ్మెల్యే నానిపై బురద జల్లడం మానుకోవాలన్నారు. టీడీపీ నేతలు ముత్తం ప్రభాకర్, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, గురుమూర్తి, బెల్లంకొండ రమణ, హైదర్‌వలీ, సహదేవరెడ్డి, రాజగోపాల్ నాయుడు, రమేశ్, చోటా సాహెబ్, ముత్యాలు, చాంద్ బాషా, రమణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నీతి కథల పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్నహేమంత్

రామచంద్రాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి బి.హేమంత్ సూచించారు. గురువారం గంగిరెడ్డిపల్లి పంచాయతీ పద్మవల్లిపురంలో చిన్నారులకు నీతికథలు, బొమ్మల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను సత్ప్రవర్తనతో నడిచేలా చూడాలన్నారు. గ్రామంలోని 30మంది చిన్నారులకు సొంత నిధులతో కొనుగోలు చేసిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్యాగరాజు, రమేష్‌రెడ్డి, వెంకటేష్, మహేష్, రమేష్‌రాయల్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు పాకాల మండల మీట్

పాకాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఎంపీడీవో అరుణ ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఆలయాల పవిత్రత పరిరక్షణకు సీఎం కృషి



ఆలయం ఎదుట జీవీ ఆంజనేయులు

తిరుమల, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి):ఆలయాల పవిత్రతను కాపాడేందకుకు సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమలలో చాలా మార్పు వచ్చిందన్నారు. పరిశుభ్రత, పవిత్రత స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. లడ్డూల నాణ్యత పెరిగిందన్నారు. సీఎం చంద్రబాబు ఆశయాలన్నీ నెరవేరాలని స్వామిని ప్రార్థించినట్టు తెలిపారు. దర్శనం అనంతరం ఆయన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పాకాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలో పాకాల మండలం పరిధిలోని దామలచెరువు సల్లాపురమ్మ గుడి సమీపాన బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మదనపల్లెకు చెందిన చరణ్ (20) మోటారు సైకిల్‌పై చిత్తూరు నుంచి మదనపల్లెకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కోళ్ల వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



మౌలాలి కుమార్తె వివాహానికి హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నాని

భాకరాపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నాని గురువారం చిన్నగొట్టిగల్లు మండలంలో పలువురిని పరామర్శించారు. అలాగే భాకరాపేటకు చెందిన టీడీపీ సీనియర్ నేత మౌలాలి కుమార్తె వివాహానికి హాజరయ్యారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. జంగావాండ్లపల్లె పంచాయతీ మారసానివారిపల్లెలో ఇటీవల ఘర్షణలో గాయపడిన టీడీపీ కార్యకర్త జయమ్మను పరామర్శించారు. బోడిరెడ్డిగారిపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న ఫణీందర్‌రెడ్డిని పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను ఆసుపత్రికి తరలించాలని స్థానిక టీడీపీ నేతలకు సూచించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, ప్రధాన కార్యదర్శి మదనమోహన, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు ముత్తం ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలికకు గాయాలు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కొర్లగుంట మారుతీనగర్‌లో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలిక తీవ్రంగా గాయపడింది. ఈస్ట్ ఎస్‌ఐ మహేష్ వివరాల మేరకు.. మారుతీనగర్‌కు చెందిన పునర్వి చాక్లెట్ కొనుక్కోవడానికి దుకాణానికి వెళుతోంది. అదే సమయంలో మారుతీనగర్‌కు చెందిన రూపేష్ ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ బాలికను ఢీకొట్టారు. ఆమె కాలు విరిగింది. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం



చికిత్స పొందుతున్న శరత్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే శరత్ (33) అనే యువకుడిపై గుర్తు యువకులు కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈఘటన గురువారం రాత్రి ఏర్పేడు మండలంలోని గోవిందవరం డంపింగ్ యార్డు వద్ద జరిగింది. గోవిందరవం గ్రామానికి చెందిన శరత్ ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇదే గ్రామ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద గురువారం రాత్రి కొందరు యువకులు మద్యం సేవించారు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ ఆటోడ్రైవర్‌పై కొందరు యువకులు హత్యాయత్నానికి పాల్పడి పరారయ్యారు. స్థానికులు గుర్తించి అతడిని చికిత్స నిమిత్తం కరకంబాడి వద్ద ఉన్న ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు గాయపడ్డారు. తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెంకు చెందిన ఎల్లయ్య(57), ఈశ్వరయ్య(35) దినసరి కూలీలు. ఇద్దరు ద్విచక్ర వాహనంపై గురువారం సొంతమపనుల నిమిత్తం గ్రామ సమీపంలోని చెన్నై రహదారి కూడలి వద్దకు వచ్చారు. పనులు ముగించుకుని రోడ్డు దాటే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎల్లయ్యను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.





పహల్గాం దాడిపై తిరుపతిలో జనసేన ఆధ్వర్యంలో నిరసన - నగరపాలక సంస్థ కార్యాలయంలో నివాళి

ఉగ్రదాడి మృతులకు నివాళి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి జనసేన ఘన నివాళి అర్పించింది. పార్టీ కార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం నాయకులు మౌన నిరసన చేపట్టారు. అమాయకులైన పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎస్‌కే బాబు, నరసింహాచారి, నరేంద్ర, దూది శివ, వేణుగోపాల్, కీర్తన, సుభాషిణీ, వనజ, బాజ్జి, వినోద్, రుద్రకిషోర్, రాధా, కోకిల పాల్గొన్నారు.

ముష్కర దాడి పిరికిపంద చర్య

తిరుపతి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం మృతులకు నివాళి అర్పించారు. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్ ఏస్కే బాబు మాట్లాడారు. అభం శుభం ఎరుగని పర్యాటకులను ముష్కరులు చంపడం దారుణమన్నారు. మతాన్ని అడిగి మరీ అంతమొందించడం పిరికిపంద చర్య అని, దీన్ని అందరూ సమైక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ అమరయ్య, ఆర్వో సేతు మాధవ్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, నాయకులు కంకణాల రజనీకాంత్, తిరుత్తణి వేణుగోపాల్, దూది శివకుమార్‌లు పాల్గొన్నారు. ***తిరుపతి అర్బన్:*** కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరారు. ఉగ్రదాడులకు నిరసనగా గురువారం రాత్రి కృష్ణాపురం ఠాణా నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ***తిరుపతి(ఆటోనగర్)*** : తిరుపతి ప్రైవేట్ రవాణా నిర్వాహకులు గురువారం సాయంత్రం గాంధీ విగ్రహం నుంచి జాతీయ జెండా వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. దేశంలో ఉగ్రవాదాన్ని అణచివేయాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు రూపేష్, బొడుగు మునిరాజ యాదవ్, బాషా, మల్లి, హరి, రాము, కమలాకర్‌రావు, సుబ్రమణ్యం, దేవా తదితరులు పాల్గొన్నారు.



క్యాండిల్ ర్యాలీ చేస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

టీడీపీ నాయకుడిపై దాడి కేసులో ఇద్దరు వైసీపీ నేతల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని మిట్టూరులో రెండు రోజులు క్రితం టీడీపీ ఒకటో డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు వైసీపీ నేతలను గురువారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. మిట్టూరుకు చెందిన వెంకటముని రెడ్డి చేపల చెరువులు నిర్వహిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం గ్రామంలో ఉత్సవ ఊరేగింపు సందర్భంగా ఆధిపత్య పోరులో భాగంగా వెంకటేష్, అతని అనుచరులపై వెంకటముని రెడ్డి, అతని తోడల్లుడు తిరుచానూరుకు చెందిన శంకర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి కళ్లలో కారం పొడి చల్లి కత్తులతో దాడి చేసి చేశారు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు సీఐ రాంకిషోర్ విచారణ చేపట్టారు. గురువారం నిందితులు వెంకటముని రెడ్డి, శంకర్ రెడ్డిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మల్లంగుంటకు చెందిన ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడు మణితో పాటు ఆరుగురిని రూరల్ ఎస్‌ఐ షేక్‌షావలి గురువారం రాత్రి అరెస్టు చేశారు. మల్లంగుంటకు చెందిన సుజిత్‌కుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లోన్ కోసం తిరుపతిలోని నవ్య ఫైనాన్సులో అతని బంధువులు ఆరుగురితో కలిసి దరఖాస్తు చేసుకున్నారు. రూ.లక్ష లోన్ మంజూరు కాగా అదే కంపెనీలో పనిచేసే సుజిత్‌కుమార్ స్నేహితుడు మణి ఆ డబ్బును వాడుకునేశాడు. ఎన్ని రోజులైనా లోన్ మంజూరు కాకపోవడంతో కంపెనీలో ఆరా తీయగా ఎప్పుడో మంజూరైనట్లు చెప్పారు. మణి వాడుకున్నాడని తెలుసుకుని గట్టిగా నిలదీశారు. సమాధానం చెప్పకపోగా అనుచరుడు ప్రకాష్ మరికొందరితో కలిసి సుజిత్‌కుమార్‌పై దాడి చేశారు. జీపులో చిగురువాడ మామిడి తోపులోకి తీసుకెళ్లి హత్యాయత్నానికి పాల్పడ్డారు. వారి నుంచి తప్పించుకున్న సుజిత్‌కుమార్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టీటీడీలో ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



కాంగ్రెస్ నేతలతో కలిసి టీటీడీ పరిపాలన భవనం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సంబంధించి ఎక్కడ చూసినా లడ్డూలు, గోవులు అంటూ మాట్లాడుతున్నారు గానీ టీటీడీ ఉద్యోగుల గురించి ఏ ఒక్క నాయకుడూ మాట్లాడకపోవడం దారుణమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. స్థానిక టీటీడీ పరిపాలన భవనం ముందు ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులు, లడ్డూల గురించి మాట్లాడే వారికి టీటీడీ ఉద్యోగుల, అర్చకులు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ఎన్ఎంఆర్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. టీటీడీ ఉద్యోగులకు, అర్చకులకు, జర్నలిస్టులకు అలిపిరి నుంచి పేరూరు వరకు ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ భూముల్లో 5 సెంట్ల వంతున ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తిరుమలలో 15 శాతం దుకాణాలను ఎస్సీలకు, 27 శాతం ఓబీసీలకు, ఏడున్నర శాతం ఎస్టీలకు కేటాయించి సామాజిక న్యాయం చేయాలన్నారు. మన ప్రాంతానికి చెందిన ఒక నాయకుడు ఇటీవల సామాజిక న్యాయం గురించి అసెంబ్లీలో ఎంతో గొప్పగా మాట్లాడటం అభినందనీయమన్నారు. లిక్కర్ స్కామ్‌లో నిందితులను జైలుకు పంపించడం సంతోషకరమన్నారు. జమ్మూ, కాశ్మీర్‌లో ఉగ్రవాదుల చర్యలను కాంగ్రెస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, మునిశోభ, రావణ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడి దుర్మరణం



సురేంద్రబాబు(ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేట హోలిక్రాస్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాంలో అపాచీ పరిశ్రమ కార్మికుడు మాయారి సురేంద్రబాబు(35) దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... దొరవారి సత్రం మండలం మోదుగులపాలెం గ్రామానికి చెందిన సురేంద్రబాబు తడ మండలం మాంబట్టు పారిశ్రామిక వాడలోని అపాచీ పరిశ్రమలో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి వద్ద నుంచి మోటరు సైకిల్ కంపెనీకి వెళ్లేందుకు బయలుదేరాడు. సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ వద్ద వెళ్తుండగా కార్మికులను తీసుకెళ్తున్న అపాచీ పరిశ్రమ అకస్మాత్తుగా ఆగడంతో సురేంద్రబాబు బైక్ ఆపారు. ఇంతలో వెనుక వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు, లారీ మధ్య ఇరుక్కుపోయిన సురేంద్ర బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వా స్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాల ప్రోత్సాహానికి కమిటీలు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల్ని సమర్థంగా అమలు చేయడానికి, రాష్ట్రంలో 10 వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో రాష్ట్ర స్థాయిలో సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు సవరించిన మార్గదర్శకాలతో ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నాబార్డు అధికారులు సభ్య కార్యదర్శులుగా ఉండే రాష్ట్ర కమిటీకి వ్యవసాయశాఖ డైరెక్టర్, జిల్లా కమిటీకి జిల్లా వ్యవసాయ అధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవహరిస్తారని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో సమానంగా చూడాలని తెలిపింది. ఎఫ్‌పీవోలకు ఎరువుల సరఫరా, ఎఫ్‌పీవోల ఉత్పత్తులకు మార్కెటింగ్, విలువ జోడింపునకు మౌలిక సదుపాయలు కల్పించనున్నట్టు పేర్కొంది.

28 నుంచి స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ అడ్మిషన్స్

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28వ తేదీ నుంచి స్విమ్మింగ్ పూల్, రైఫిల్ షూటింగ్‌కు అడ్మిషన్స్ ప్రారంభిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు క్రీడాంశాలు మే ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఈతకు నెలకు పెద్దలైతే రూ.1,500, పిల్లలైతే రూ.వెయ్యిగా నిర్ణయించినట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9866317312ను సంప్రదించాలని కోరారు.

జూన్ నుంచి ఎరువుల డీలర్లకు కొత్త లైసెన్స్ విధానం

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువులు, విత్తనాల క్రయ విక్రయాల లైసెన్స్‌ల విధానంలో మార్పులు చేసినట్టు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. 2021 నుంచి అమలులో ఉన్న ఈ-ఆఫీస్ విధానం వచ్చే నెలతో రద్దు కానున్నట్టు చెప్పారు. వచ్చే జూన్ నుంచి ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఓఎల్ఎంఎస్) ప్రారంభమౌతుందన్నారు. ప్రస్తుత లైసెన్స్‌ల వివరాలను ఈ నెలాఖరులోపు కొత్త విధానంలో నమోదు చేయాలని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు.

నాయీ బ్రాహ్మణులకు వేతనాల పెంపు హర్షణీయం

తిరుపతి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : ఆలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు వేతనాలు పెంచుతూ దేవదాయశాఖ గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. దీనిపై నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం హర్షం వ్యక్తం చేశారు. రూ.20వేల నుంచి రూ.25వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు.

నేటి నుంచి ఇళ్ల సర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న పేదల ఇళ్లను శుక్రవారం నుంచి సర్వే చేయనున్నారు. జీవో 30ప్రకారం 2019 అక్టోబరు 15ముందు తమ ఆధీనంలో ఉండి, కరెంటు, పన్నుల అర్హత ఉన్న పేదలకు క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం జనవరిలో ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. దరఖాస్తుల ఆధారంగా ఇళ్ల సర్వే, ఇతర ఆధారాలను తనిఖీ చేయడానికి వీఆర్వో, విలేజ్ సర్వేయర్లతో కలిపి 9 బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి పర్యవేక్షకులుగా డీటీలు కిరణ్‌కుమార్, రామచంద్ర, ఆర్‌ఐ కృష్ణవేణిలను నియమించారు.

జ్యువలరీ షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభంలో నటి మీనాక్షిచౌదరి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రకాశం రోడ్డులో గురువారం సీఎంఆర్ జ్యువలరీ షోరూం ప్రారంభమైంది. సినీ నటి మీనాక్షిచౌదరి ప్రారంభించారు. ఆమె మాట్లాడూతూ సీఎంఆర్ గోల్డ్ షోరూం ఓపెనింగ్ సందర్భంగా తిరుపతికి రావడం, స్వామి వారిని దర్శనం చేసుకోవడం ప్రత్యేక అనుభూతి కలిగించిందన్నారు. సీఎంఆర్ ఫౌండర్ మావూరి వెంకటరమణ, ఎమ్మెల్యే నాని, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సాగర్, మావూరి శ్రీనివాసు, పరదాల మణి పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి



ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కుందేలు వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.. భాకరాపేట సీఐ ఇమ్రాన్ కథనం మేరకు వివరాలు ఇలా.. మండలంలోని చింతగుంట పంచాయతీ పచ్చార్లవాండ్లపల్లెకు చెందిన కంచన శ్రీకాంత్ బుధవారం రాత్రి సమీపంలోని అటవీప్రాంతంలో కుందేలు వేటకు వెళ్లాడు. ఈక్రమంలో విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మరణించాడు. మరో మూడు రోజుల్లో ఉపాధి కోసం కువాయిట్ వెళ్లాల్సిన తరుణంలో మృత్యువాత పడ్డాడంటూ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. శ్రీకాంత్‌కు కుమార్తె, భార్య ఉన్నారు.

జూనియర్ కాలేజీల్లో గెస్ట్ ఫ్యాకల్టీల కొనసాగింపు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న 957 మందిని కొనసాగించేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 28 వరకు వారు కొనసాగుతారని తెలిపారు. మొత్తం ఏడాదిలో ఒక నెల 8 రోజులు బ్రేక్ ఉంటుందన్నారు.

కిశోర బాలికల సమగ్రాభివృద్ధికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వసంతబాయి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ శిరీష అన్నారు. జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కిశోర వికాసం వర్క్‌షాప్ నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ నాగశైలజ మాట్లాడుతూ కిశోర బాలికలకు క్యాలెండర్ రూపొందించి కార్యక్రమాలు గ్రామస్థాయి వరకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. వసంతబాయి మాట్లాడుతూ కిశోర వికాసం ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీ వరకు పటిష్టంగా నిర్వహించాలన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మికులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 24: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాల సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కార్మిక సంక్షేమ నిధిలో రూ.800 కోట్లను దారి మళ్లించి, దుర్వినియోగం చేసిందన్నారు. సంక్షేమ బోర్డులోని సొమ్ము కార్మికులకే చెందాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తున్నాయన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ మేరకు డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లయ్య, శ్రీనివాసులు, శంకరయ్య, రఫీ, వేణు, తిరుమలరెడ్డి, నరసింహులు, శ్రీరాములు, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో మే నెలలో విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. 1 నుంచి 10వ తేదీ వరకు మధురకవి, అనంత ఆళ్వార్ ఉత్సవం జరగనుంది. 2న భాష్యకార్ల శాత్తుమొర, 3న భాష్యకార్ల గంధపు పొడి ఉత్సవం నిర్వహిస్తారు. 8న శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఆలయ మాడవీధుల్లో విహరిస్తారు. 9 నుంచి 11వ తేదీ వరకు బుగ్గోత్సవం, 12న పొన్నకాల్వ ఉత్సవం జరుగుతాయి. 16, 23, 30 తేదీల్లో ఆండాళ్ అమ్మవారిని మాడవీధుల్లో ఊరేగిస్తారు. 19న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఊరేగింపు జరుగుతుంది. 27న రుక్మిణి, సత్యభామ సమేత పార్థసారథి స్వామి ఊరేగింపు ఉంటుంది. 31 నుంచి జూన్ 9 వరకు నమ్మాళ్వార్ ఉత్సవం నిర్వహిస్తారు.

ఎస్పీడబ్ల్యూ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా పద్మావతి


ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మావతి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా మద్దూరి పద్మావతి (ఫార్మసీ విభాగం హెడ్) గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ప్రిన్సిపాల్‌గా ఉన్న అసుంతపై ఫిర్యాదుల నేపథ్యంలో నరసింగాపురం ఫార్మసీకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జ్‌గా పద్మావతిని నియమిస్తూ టీటీడీ డీఈవో విజయలక్ష్మి ఉత్తర్వులు విడుదల చేశారు. గురువారం బాధ్యతలు తీసుకున్న ఆమెను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పర్యాటకుల మృతి బాధాకరం




పోస్టర్లు ప్రదర్శిస్తున్న నరసింహ యాదవ్, మునికృష్ణ తదితరులు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో పర్యాటకులు మృతి చెందడం బాధాకరమని టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దాడిలో మరణించిన వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పారు. భారతదేశం ఎంత సఖ్యతగా ఉన్నా పాకిస్తాన్ ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వాలు, సైన్యం కఠినంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ ఉగ్రవాదంపై అన్ని దేశాలు కలిసి ఉక్కుపాదం మోపాలన్నారు. దీనికి ప్రజలు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, మాజీ కౌన్సిలర్ హేమంత్‌యాదవ్, గంగమ్మ గుడి మాజీ బోర్డు మెంబర్ సుధాకర్‌రెడ్డి, టీడీపీ నేతలు సుబ్బుయాదవ్, ఎస్కే శ్రీధర్, రవితేజ పాల్గొన్నారు.

11న మాలల ఆత్మగౌరవ సభ


తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కరకంబాడి రోడ్డులోని ఆశా కన్వెన్షన్ హాల్లో మే 11వ తేదీన మాలల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు మాల జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ మార్చిలో నిర్వహించాల్సిన సభ అనివార్య కారణాలతో వాయిదా పడిందన్నారు. ఐక్యతను చాటే ఈ సభకు మాలలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాల జేఏసీ నాయకులు అశోకరత్నం, దాము, మధు, జయరాం, రాజ్‌కుమార్, దేవరాజులు, సుబ్రహ్మణ్యం, బట్టు, జయచంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీలో రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ - రుయా సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాతలను వీసీ కృష్ణమూర్తి అభినందించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ రాధాగోవిందత్రిపాఠి, ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ పాల్గొన్నారు.

ఔషధ వనం ఏర్పాటు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీలో 70 రకాల మొక్కలతో ఔషధ వనం ఏర్పాటైంది. వీసీ కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ మొక్కలతో పాటే వాటి పేర్లతో కూడిన బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. మరింతగా దీన్ని విస్తరింపజేయనున్నట్టు వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ బాలదత్తాత్రేయ పాల్గొన్నారు.

నగరవనంపై దుమారం

చెట్లు నరికేసి నిర్మాణాలు చేపట్టారంటూ ప్రచారం
స్టాఫ్ క్యాంటీన్ కోసం తాత్కాలిక నిర్మాణం అంటున్న అటవీశాఖ
సందట్లో సడేమియాలా హరిత హననం అంటూ వైసీపీ రాజకీయం

తిరుపతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి దివ్యారామంగా పిలుచుకునే నగరవనంలో విలువైన వృక్షాలను నరికేస్తున్నారంటూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు సంచలనంగా మారాయి. ఎర్రచందనం సహా పెద్ద సంఖ్యలో వృక్షాలను నరికేసి నిర్మాణాలు చేపడుతున్నారంటూ పోస్టులు పెట్టారు. దీంతో వైసీపీ యువ నేత అక్కడకు వెళ్లి హరిత హననం చేస్తారా.. అన్యాయం అని అన్నారు. కొందరు పర్యావరణ ప్రియులు కూడా నగరవనంలో చెట్ల నరికివేతను ఆపాలంటూ పిలుపునిచ్చారు. ఉదయపు నడకదారులకు స్వర్గధామం లాంటి దివ్యారామంలో అసలు ఏం జరుగుతోందనే చర్చకు ఈ పరిణామాలు దారితీశాయి.


నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో కొన్ని చెట్లు కొట్టేసిన ఆనవాళ్లు



మూడు నెలల కిందట అడవి ఇలా ఉండేదంటూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు - ఇప్పటికీ అలాగే ఉన్న చెట్లు (బుధవారం నాటి ఫొటో)

సోషల్ మాయ

చదును చేసిన ప్రదేశాన్నీ, మూడు నెలల కిందట ఇలా ఉండేదంటూ దట్టంగా చెట్లుండే ఒక దారి ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. 'అయ్యో ఇంత అడవి నరికేశారా' అని సోషల్ మీడియాకు మాత్రమే స్పందించే కొందరు విచారం వ్యక్తం చేస్తూ ఆ పోస్టులను ఫార్వర్డ్ చేశారు. ఉదయపు నడక కోసం వెళ్లిన వారికి మాత్రం అక్కడ పెద్దగా తేడా కనిపించలేదు. మూడేళ్ల కిందట ఇలా ఉండేదంటూ పెట్టిన ఫొటోలోని చెట్లన్నీ చెక్కుచెదరకుండా అలాగే ఉన్నాయి. మరి హరిత హననం ఎక్కడ జరిగిందా అని ఆరా తీశారు. మరోవైపు కొన్ని యూట్యూబ్ చానళ్లు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ సంఘటనతో పోలుస్తూ వార్తలు ఇవ్వడంతో ఈ అంశం చర్చగా మారిపోయింది.

అసలేం జరుగుతోంది?

నిజానికి దివ్యారామం గేటు నుంచి లోపలికి ప్రవేశించగానే కుడివైపున ఉన్న ప్రదేశంలో కొంత ప్రాంతం చదును చేసి తాత్కాలిక నిర్మాణం చేపడుతున్నారు. అక్కడ పిచ్చి కంపతో పాటూ నాలుగైదు వృక్షాలు నరికేసిన ఆనవాళ్లు కూడా కనిపిస్తున్నాయి. ఇనుప బేస్‌తో తాత్కాలిక నిర్మాణం జరుగుతోంది. విధి నిర్వహణలో అశువులు బాసిన అటవీశాఖ సిబ్బంది డేవిడ్, శ్రీధర్‌ల స్మారకార్థంగా ఎకో డెవలప్మెంట్ కమిటీ వెదురు బొంగులు, బోదతో చిన్న కుటీరం లాంటి నిర్మాణం చేపడుతున్నట్టు అధికారులు అంటున్నారు. అందులో క్యాంటీన్ ఏర్పాటు చేసి అటవీశాఖలో పనిచేసే వందలాది మంది చిరుద్యోగులకు తక్కువ ధరతో ఆహార పదార్థాలు అందజేయనున్నట్టు చెబుతున్నారు. పర్యావరణానికి ఏమాత్రమూ ఉపయోగపడకుండా ఉండే చెట్లను కొన్నింటిని మాత్రమే తొలగించామని, వాటికి ప్రత్యామ్నాయంగా 200 మొక్కలను నాటే బాధ్యత తీసుకుంటున్నామని తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఒక్క ఎర్రచందనం చెట్టును కూడా కొట్టలేదని చెప్పారు. కాగా దీనిపై సమగ్ర వివరాలు సమర్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అటవీ శాఖ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

డబుల్ డెక్కర్ నరికివేత మరిచిపోయారా?

పర్యావరణ ప్రియుల ఆందోళనను వైసీపీ రాజకీయంగా వాడుకోవడానికి ప్రయత్నించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. డబుల్ డెక్కర్ బస్సు తిరగడానికి అడ్డు అనే కారణంతో నగరంలో వందలాది చెట్లను తెగ నరికేసిన నాయకులు ఇప్పుడు హరిత హననం అంటూ గుండెలు బాదుకోవడం ఏమిటని అంటున్నారు. అలిపిరి నుంచి జూపార్క్ దాకా ఉండే దట్టమైన అడవిని అనేక సంస్థలకు అప్పనంగా ఇచ్చేసి వృక్షాలు కూల్చేస్తూ ఉంటే గత ఐదేళ్లు నోరు విప్పని వారు ఇప్పుడు మాత్రం ఎందుకు మాట్లాడుతున్నారనే అంశమూ తిరుపతిలో చర్చగా మారింది. అయితే అటవీశాఖ కూడా తొందరపాటును ప్రదర్శించరాదనీ, ఒకవేళ కొన్ని చెట్లు కొట్టవలసి వస్తే దివ్యారామం నడకదారుల సంఘం, ఇతర పర్యావరణ ప్రియులతో సమావేశమై వివరించి ఉండాల్సిందని అంటున్నారు.

టెన్త్ ఫలితాల్లో ప్రైవేట్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ప్రతిభచాటారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయ ప్రభంజనం


విద్యార్థులతో శ్రీచైతన్య ఏజీఎం సురేష్, తదితర అధ్యాపకులు

శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు తిరుపతి జోన్‌లో అత్యధిక మార్కులతో విజయ ప్రభంజనం సృష్టించారని ఏజీఎం జి.సురేష్ పేర్కొన్నారు. ఆర్.సన్‌షితరెడ్డి 597 మార్కులు, టి.రితిక్‌రోషిణి, కె.బ్రింద 596, ఎస్.శరణ్య, జి.సాయిమోక్షజ్ఞ, కె.లాస్య 595, సాయిలేఖన, త్రిశాంక్, ఇందుప్రియ, వెంకటపవన్, చార్వి, డజి, స్నేహిత్, కుషల్‌వర్మ, హర్షిత, సాహిత్య 594 మార్కులతో సత్తాచాటారు. 80 మంది 590 మార్కులకు పైన 261మంది 580కి పైన, 356 మంది 575 పైన 753 మంది 550పైన 1,326 మంది 500 పైన మార్కులు సాధించారని తెలిపారు. ప్రిన్సిపాల్స్, డీన్లు, కో-ఆర్డినేటర్లు, టీచర్లు విద్యార్థులను అభినందించారు.

నారాయణ విద్యార్థుల విజయకేతనం


నారాయణ విద్యార్థులతో డీజీఎం కొండలరావు, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు

నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని డీజీఎం కొండలరావు తెలిపారు. తమ విద్యార్థులు ప్రణతి, దీపిక, హృతిక 600 మార్కులకుగాను 596 మార్కులతో సత్తా చాటగా మరో 45 మంది విద్యార్థులు 590కి పైగా మార్కులు సాధించి సంచలనం సృష్టించారన్నారు. విద్యార్థులను డీజీఎంతోపాటు ఏజీఎంలు శ్రీనివాస్, సురేష్, రీజనల్ ఇన్‌చార్జ్ వసంత్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజు విద్యాసంస్థల విజయభేరి


అనుశ్రీ

తిరుపతి రాజు విద్యాసంస్థల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి విజయభేరి మోగించారని రాజు విద్యాసంస్థల అధినేత జగన్‌మోహన్‌రాజు తెలిపారు. తమ విద్యార్థులు బి.అనుశ్రీ 600 మార్కులకుగాను 596 మార్కులు, ఆర్.సాయి విష్ణు స్వరూప్ 585, డి.శివసందీప్ 582 సాధించారని వెల్లడించారు. అలాగే 23 మంది 550కి పైన, 37 మంది 500కి పైన మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను, వారి విజయానికి కారకులైన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

శ్రీవెంకటేశ్వర విద్యార్థుల విజయదుందుభి


శ్రీవెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో శ్రీవెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులతో విజయదుందుభి మోగించారని పాఠశాల అధినేత కేఎస్ వాసు తెలిపారు. కె.సంయుక్త 600 మార్కులకుగాను 595, కె.వేణు 593, ఎం.భవ్యశ్రీ 592 మార్కులు సాధించారని చెప్పారు. 254 మంది విద్యార్థులకుగాను 249 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని, 163 మంది 500లకు పైగా మార్కులు పొందారని వెల్లడించారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను కేఎస్ వాసు, ప్రధానోపాధ్యాయిని స్వప్నలత అభినందించారు.

వేసవి శిక్షణ శిబిరం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 28 నుంచి మే 7వ తేదీ వరకు డ్రాయింగ్, మ్యాథ్స్, 8 నుంచి 21వ తేదీ వరకు కథలు, పాటలు, గుండ్రటి చేతిరాత, 22 నుంచి 31వ తేదీ వరకు చెస్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిక్షణ ఉంటుంది. మే 1 నుంచి 31వ తేదీ వరకు కర్రసాము, మే 1 నుంచి 6 నెలల పాటు క్లాసికల్ డ్యాన్స్‌పై ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుంది. పూర్తి వివరాలకు 8985080370, 9398000686లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

హోమం నిర్వహణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శ్రీని గురూజీ

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నిత్యాగ్ని సర్వ దేవత హోమం నిర్వహణపై అరుణాచలం నుంచి వచ్చిన శ్రీని గురూజీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవకోనలోని లలిత త్రిపుర సుందరి దేవాలయంలో సేవా కుటుంబ సభ్యులందరూ పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. హిందూ ధర్మాన్ని, సంప్రదాయాలను, పూర్వీకులు ఇచ్చిన హోమ కార్యక్రమాలను సులభతరంగా ఇంట్లోనే నిర్వహించుకునే విధంగా శిక్షణ ఇచ్చారు.

ద టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో ఎస్వీయూకు స్థానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ద టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ -2025లో ఎస్వీయూకు స్థానం లభించింది. బోధన, పరిశోధన, విస్తరణ వంటి అంశాలను పరిశీలించి ఈ గుర్తింపును ప్రకటించారు. 35 దేశాలకు చెందిన 853 యూనివర్సిటీలను పరిశీలించారు. ఇందులో ఇంటర్నేషనల్ పర్స్పెక్టివ్-29.2, ఇండస్ట్రియల్ కొలాబరేషన్-25.6, రీసెర్చ్-14.1, టీచింగ్-43.5 శాతం గ్రేడింగ్ పొందింది. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల కృషి ఫలితామని వారు పేర్కొన్నారు.

ఆర్టీసీ ద్వారా పాఠ్యపుస్తకాల రవాణా


సమావేశంలో చర్చిస్తున్న అధికారులు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డీజీటీ ద్వారా 14,20,722 ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలను రవాణా చేయడానికి చర్యలు ప్రారంభమయ్యాయి. సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు, టెక్స్‌బుక్ డిపో మేనేజర్ రమేష్ దీనిపై గురువారం చర్చించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లోని ఎమ్మార్సీ సెంటర్లకు చేరవేయాలని, పాఠశాలలు ప్రారంభం కాకమునుపే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని రమేష్ కోరారు.

వ్యవసాయానికి 610 మెగావాట్స్ సోలార్ విద్యుత్

కుప్పంకు అధిక ప్రాధాన్యం

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ సదరన్ డిస్కం పరిధిలో వ్యవసాయరంగానికి 610 మెగావాట్స్ సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి రంగం సిద్ధం చేసింది. తద్వారా ఉమ్మడి ఐదు జిల్లాల్లో 1.35 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. ఈ స్కీంలో కుప్పం నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇచ్చారు. కుప్పం నియోజకవర్గంలో 30వేలమంది చిన్న, మధ్య తరహా రైతులు ఉన్నారు. వారికి 141 మెగావాట్స్ సోలార్ విద్యుత్ సరఫరా చేయడానికి నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కుసుమ్ పథకం ద్వారా రాష్ట్రంలో రైతులకు 9 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి రాయితీతో నిధులు మంజూరు చేసింది. ఆ మేరకు 58 ఫీడర్ల ద్వారా 1.35 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు సరఫరా చేయడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు టెండర్లు కూడా ఆహ్వానించినట్లు తెలిసింది.

ఈస్ట్ సీఐ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ సీఐగా కె.శ్రీనివాసులు గురువారం రెండవసారి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఒకటిన్నర నెల ఇక్కడ పనిచేసి వివిధ కారణాలతో వీఆర్‌కు బదిలీ అయ్యారు. దాదాపు ఆరు నెలలు వీఆర్‌లో ఉన్న ఆయన్ను తిరుపతి ఈస్ట్ సీఐగా నియమిస్తూ డీఐజీ షిమోషీ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన ఎస్పీ హర్షవర్ధన రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

టీటీడీ ఉద్యోగుల పిల్లలకు క్రికెట్ శిక్షణ

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగుల పిల్లలకు, టీటీడీ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 27నుంచి జూన్ ఒకటో తేదీ వరకు క్రికెట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ఉంటుంది. పూర్తి వివరాలకు 9989033100, 9652988727, 7382059520లను సంప్రదించాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ హయాంలోనే మద్యం మాఫియా

మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మద్యం మాఫియా, బెల్టుషాపులు తెరపైకి వచ్చాయని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఆరోపించారు. తిరుపతి పద్మావతీపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ మద్యపాన నిషేధం పెడితే చంద్రబాబు దాన్ని ఎత్తేశాడని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో ప్రవేశపెట్టిన మద్యం పాలసీలే ఇప్పటికీ అమలవుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ వైసీపీ నాయకులను లొంగదీసుకునే ప్రయత్నాలు చేస్తోందన్నారు. విజయసాయిరెడ్డి మద్యం అక్రమాలపై చేస్తున్న వ్యాఖ్యల గురించి మీడియా అడగ్గా ఆయన అలా ఎందుకు చెబుతున్నాడో అర్థం కావడం లేదన్నారు.

'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా విజేతలకు
బహుమతుల పంపిణీ

తిరుపతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు కార్ అండ్ బైక్ రేసుకు సంబంధించి గత నెల 25వ తేదీన జరిగిన లక్కీ డ్రాలో విజేతలైన ముగ్గురికి గురువారం తిరుపతిలో బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి పొందిన తిరుపతి గోపాలరాజు కాలనీకి చెందిన డి.వత్సలకు ఆంధ్రజ్యోతి తిరుపతి బ్రాంచి మేనేజరు సురేష్‌రెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ ఉమాపతి హీరో హోండా బైక్‌కు సంబంధించి చెక్ అందజేశారు. తిరుపతి కపిలతీర్థం రోడ్డుకు చెందిన మరుదాడ నగేష్‌కు ద్వితీయ బహుమతి కింద రెఫ్రిజిరేటర్.. పలమనేరు నెహ్రూ నగర్‌కు చెందిన టి.కె.శశిధర్‌కు తృతీయ బహుమతి కింద టీవీ అందజేశారు.







ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద చెక్కు, రిఫ్రిజిరేటర్, టీవీ అందుకుంటున్న వత్సల, నగేష్, టి.కె.శశిధర్


సర్వదర్శనానికి 12 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంటన్నీ సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.62 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,705

తలనీలాలు సమర్పించినవారు: 25,382





ఇలా సిద్ధమైతే... పాలిసెట్ విజేతలు మీరే



తిరుపతి(విద్య), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులపై ఆసక్తి పెరుగుతోంది. పదవ తరగతి తర్వాత ఎక్కువ మంది ఈ కోర్సుల్లో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎక్కువ మందికి ఉద్యోగ,ఉపాధి ఉపాధి అవకాశాలు లభించడమే ఇందుకు కారణం. జిల్లాలో 6 ప్రభుత్వ, 7 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ఎయిడెడ్ కళాశాల కూడా ఉంది. మొత్తం 3500 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుల ప్రవేశానికి ఈనెల 30న జరిగే పాలిసెట్ పరీక్షకు సిలబస్‌ను బాగా చదువుకుంటే విజేతగా నిలవడం సులభమేనంటున్నారు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్.వి. గౌరీశంకర్. రెండు గంటల్లో 120 ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయగలిగేలా టైం ప్లాన్ చేసుకోవాలంటున్నారు. పదవ తరగతి సిలబస్ నుంచి గణితంలో 50 మార్కులకు, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నాపత్రం ఉంటుంది. నెగెటివ్ మార్కులు ఉండవు. సబ్జెక్టుల వారీగా ఆయన సూచనలిలా..

కళాశాలల వివరాలు

- **తిరుపతి:** బయోమెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ (షుగర్ టెక్నాలజీ), కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఫార్మసీ (ఇంటర్ అర్హతతో).
- **చంద్రగిరి:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్
- **కిల్లాపట్టు:** మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ ఇంజనీరింగ్.
- **సత్యవేడు:** మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్.
- **గూడూరు:** మైనింగ్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిరామిక్ టెక్నాలజీ. (ప్రత్యేక కళాశాల).
- **తిరుపతి టీటీడీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల:** కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీస్‌తో పాటు కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మసీ (ఇంటర్ అర్హత) బ్రాంచిలున్నాయి.

గణితం

త్రికోణమితి, నిరూపక రేఖా గణితం, సంభావ్యత, సంఖ్యాశాస్త్రం, పురోగతి, త్రిభుజాలు, వృత్తాలు, ద్విపద సిద్ధాంతం, మాత్రికలు, ఘతాంతక మరియు లాగరిథమిక్ సిరీస్, సమీకరణాల సిద్ధాంతం వంటి వాటిపై విద్యార్థులు పట్టు సాధించాలి. ఐదేళ్ల క్రితం నుంచి ఉన్న ప్రశ్నా పత్రాలను అభ్యాసం చేయగలిగితే మంచి మార్కులు పొందొచ్చు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో ప్రతి ఛాప్టర్ చివరిలోని ముఖ్యాంశాలను చదువుకోవాలి.

ఫిజిక్స్

ఆరు చాప్టర్లు ఉంటాయి. వేడి, సమతల ఉపరితలాల వద్ద కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, వివిధ ఉపరితలాల ద్వారా కాంతి ప్రతిబింబం, మానవ కన్ను, రంగుల ప్రపంచం, విద్యుదయస్కాంతత్వం చాప్టర్లలో ఒక్కో ఛాప్టర్ నుంచి 8 నుంచి 10 ప్రశ్నల వరకు వచ్చే అవకాశం ఉంది.

కెమిస్ట్రీ

పదవ తరగతి కెమిస్ట్రీలో నాలుగు చాప్టర్లు ఉంటాయి. ఒక్కో చాప్టర్ నుంచి 7 నుంచి 8 ప్రశ్నలు వచ్చే అవకాశముంటుంది. మూలకాల వర్గీకరణ-ఆవర్తన పట్టిక, లోహశాస్త్రం సూత్రాలు, రసాయన ప్రతిచర్యలు, సమీకరణాలు, అణువుల నిర్మాణం, రసాయన బంధం, కార్బన్-సమ్మేళనాలు, ఆమ్లాలు, క్షారాలు,లవణాలు అంశాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ముందుగా కెమిస్ట్రీ ప్రశ్నలకు జవాబులు ఇస్తే సమయం కలిసి వస్తుంది.




డాక్టర్ **ఎస్.వి. గౌరీశంకర్,** జనరల్ సెక్షన్ హెడ్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతి.

మంచి భవిష్యత్తు



పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి. కోర్సు పూర్తిచేసివారు ఎంట్రన్స్ ర్యాంకుతో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కళాశాలల్లోని సహాయక కేంద్రాలలో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

\- డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



టీటీడీకి గురువారం ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళంగా అందింది. మహారాష్ట్రకు చెందిన బిగాస్ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం రూ.1.40 లక్షల విలువైన బిగాస్ సీ12 మాక్స్ 3.0 అనే ఎలక్ట్రిక్ స్కూటర్‌ను టీటీడీకి అందజేసింది. ముందుగా వాహనానికి శ్రీవారి ఆలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ డిప్యూటీఈవో లోకనాథంకు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ దుర్గేష్ గుప్తా వాహన తాళాన్ని అందజేశారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

డిప్యూటీ సీఎంకు సాదర వీడ్కోలు



రేణిగుంట, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు తిరుపతి విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. పెహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావుకు గురువారం నివాళులర్పించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన సాయంత్రం 6.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకోగా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ రవిమనోహరచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ సురేష్‌బాబు, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోట వినుత వీడ్కోలు పలికారు. ఆయన ప్రత్యేక విమానంలో విశాఖపట్నం వెళ్లారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ శ్రీకాళహస్తి న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు కోర్టు లైజనింగ్ అధికారి గోపాల్‌రాజు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఏర్పేడు మండలం చెల్లూరుకు చెందిన సుబ్బమ్మ, కుమారుడు జగ్గయ్యతో కలిసి నివాసం ఉండేది. ఆమె భర్త బాలసుబ్రహ్మణ్యం కుటుంబ కలహాలతో మునలిపేడులో ఉంటున్నాడు. అనారోగ్యంతో ఆయన 2016లో మృతి చెందాడు. భర్త కర్మక్రియల కోసం కుమారుడితో కలిసి సుబ్బమ్మ అప్పట్లో మునిలిపేడుకు వెళ్లగా, ఇంటి స్థలం విషయమై వారిమధ్య విబేధాలు ఉండటంతో భర్త తరపు బంధువులు ఆమెను అడ్డుకుని వెళ్లగొట్టారు. ఆ తర్వాత 2017 ఏప్రిల్‌లో పోలీస్‌స్టేషన్ ఎదుట ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని నిరసన చేస్తున్న వారిపై లారీ దూసుకెళ్లిన ఘటనలో మృతిచెందిన వారిలో మునిలిపేడుకు చెందిన సుబ్బమ్మ దాయాదులైన బాబు, హరి ఉన్నారు. 2017 మే 11న మునిలిపేడులో దాయాదుల కర్మక్రియలకు సుబ్బమ్మ, జగ్గయ్య వెళ్లగా.. మళ్లీ భర్త తరపు బంధువులు ఆమెతో వాగ్వాదానికి దిగారు. కొందరు పెద్దలు ఇరువర్గాలకు చెప్పారు. ఈ క్రమంలో బాలసుబ్రహ్మణ్యం సోదరి సుజాత బొడ్డులో కత్తి పెట్టుకుని వచ్చి వదిన సుబ్బమ్మను పొడవడంతో ఆమె కుప్పకూలారు. సుజాతకు భర్త వెంకటేష్, అత్త రాణెమ్మ సహకరించారు. ఆ తర్వాత జగ్గయ్యను కూడా పొడిచేందుకు ప్రయత్నించగా మిగతావారు అడ్డుకున్నారు. గాయపడిన సుబ్బమ్మను తిరుపతి రుయాకు తరలించగా అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. జగ్గయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వెంకటరమణ హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏ1 సుజాత, ఏ2 రాణెమ్మ, ఏ3 వెంకటేష్‌ను అప్పట్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి న్యాయస్థానంలో విచారణఅనంతరం గురువారం 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ ముగ్గురు నిందితులకు యావజ్జీవశిక్షతో పాటు రూ.15వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు ఛేదనలో పీపీ వీరరాఘవరెడ్డి, కోర్టు మానటరింగ్ సీఐ వెంకటప్ప తదితరులు చొరవ చూపారు. చురుగ్గా వ్యవహరించిన ఏర్పేడు పోలీసు అధికారులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

సంకీర్తనల వైపు యువతను తీసుకెళ్లాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలను యువతకు యూట్యూబ్ ద్వారా చేరువ చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పరిపాలనా భవనంలో గురువారం వివిధ విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ఎస్వీబీసీ ద్వారా సంకీర్తనలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇందుకోసం నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనలతో వేగవంతంగా సంకీర్తనలను యూట్యూబ్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుపతిలో జరుగుతున్న వివిధ ఇంజనీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వేసవి సందర్భంగా స్థానికాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా, రద్దీకనుగుణంగా చర్యలు చేపట్టాలని జేఈవోను ఆదేశించారు. అనంతరం తిరుపతిలోని ఆరోగ్య విభాగం, శ్వేత, టీటీడీ కొనుగోళ్ల విభాగం, స్విమ్స్, విద్య, వైద్యం తదితర విభాగాల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 22 మంది డిబార్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో చేపట్టిన డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షల్లో 22 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. మదనపల్లె-16, చిత్తూరు-6 మంది మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విషయాన్ని గుర్తించి హైపవర్ కమిటీ డిబార్ చేసినట్లు పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

రెవెన్యూ అధికారులు లంచం అడుగుతున్నారా?

- బోడిలింగాలపాడు గ్రామస్థులను అడిగిన కలెక్టర్



గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'రెవెన్యూ అధికారులు, సిబ్బంది మిమ్మల్ని లంచాలు అడుగుతున్నారా? లేకపోతే ఇబ్బందులు పెడుతున్నారా?' అని కలెక్టర్ వెంకటేశ్వర్ స్థానికులను ప్రశ్నించారు. తండ మండలం తడకండ్రిగ పంచాయతీ బోడిలింగాలపాడులో గురువారం పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. బోడిలింగాలపాడు జాతీయ రహదారి మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని దానిపై చర్యలు తీసుకోవాలని, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. నెల్లూరుజిల్లా జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫోన్‌చేసి ఆ మలుపును పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

రూ.25 కోట్లతో హాస్టళ్ల మరమ్మతులు

జిల్లాలో రూ.25 కోట్లతో సుమారు 110 హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తడలోని బీసీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. హాస్టళ్లలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.6 కోట్లను మంజూరు చేసిందని, అదనంగా కావాల్సిన సౌకర్యాల కోసం జిల్లాస్థాయిలోనే పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు, బీఎంఎస్, ఎంపీలాడ్స్ నుంచి రూ.25 కోట్లు సమకూర్చుకుని అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నామన్నారు. వీటిద్వారా ఆర్వో వాటర్, రూఫ్ ట్రీట్‌మెంట్, మరుగుదొడ్లు, పర్మినెంట్ వంటగది, దోమల తెరలతో కూడిన కిటికీలు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పనులన్నీ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీవో కిరణ్మయి, తడ, సూళ్లూరుపేట తహసీల్దార్లు శరత్‌బాబు, నరసింహారావు, ఎంపీడీవో విజయ్ కుమార్, సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులే వస్తే..
తిరుమలలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



విశ్రాంతి భవనంలోకి వెళుతున్న ఉగ్రవాదులు



ఉగ్రవాదుల సమాచారమిస్తున్న విజిలెన్స్ వీజీవో

అది తిరుమల లేపాక్షి సర్కిల్ వద్దనున్న సుదర్శన్ విశ్రాంతి భవనం. గురువారం సాయంత్రం ముగ్గురు ఉగ్రవాదులు వాహనంలో వచ్చి పాకిస్థాన్ జిందాబాద్, జీహాద్ అంటూ కేకలు వేస్తూ వచ్చారు. విశ్రాంతి గృహ ప్రవేశం వద్ద ఇద్దరు సెక్యూరిటీ గార్డులను గాయపరిచారు. ఒక ఉగ్రవాది అంతస్థు పైభాగంలోకి.. మరొకరు ఓ గదిలోకి.. ఇంకొకరు భవనం ప్రవేశంలోకి చేరారు. విజిలెన్స్ సిబ్బంది సమాచారంతో వీజీవో, స్థానిక పోలీసు అధికారులతో పాటు ఓ కమెండో ఆధ్వర్యంలో 29 మంది ఆక్టోపస్ సిబ్బంది లేపాక్షి సర్కిల్‌కు చేరుకున్నారు. భవనం మ్యాప్‌ను పరిశీలించారు. మూడు బృందాలుగా విడిపోయారు. భవనం ప్రవేశంలో ఉన్న ఓ ఉగ్రవాదిని అసాల్ట్ డాగ్ ఎనిమీ విధానంలో హతమార్చారు. ఆ తర్వాత భవనంలోకి వెళ్లి, ఓ గదిలో దాక్కున్న ఉగ్రవాదిని, ఆ తర్వాత భవనంపై ఉన్న మరో ఉగ్రవాదిని హతమార్చారు. అప్పటికే విశ్రాంతి భవనం వద్దకు చేరుకున్న వైద్య సిబ్బంది ఉగ్రవాదుల దాడిలో గాయపడిన భక్తుడు, సిబ్బందికి చికిత్స అందజేసి అస్పత్రికి తరలించారు. ఇక, ఫైర్ సిబ్బంది కూడా ఉగ్రవాదులు ద్వారా తలెత్తిన మంటలను అదుపుచేశారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి




విశ్రాంతి భవనంలోకి ప్రవేశిస్తున్న అక్టోపస్ సిబ్బంది - రూమ్ ఇన్టర్వెన్షన్ విధానంలో మరో ఉగ్రవాదిని అదుపులోకి తీసుకున్న అక్టోపస్ సిబ్బంది

- పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలో ఆక్టోసప్ బృందం ఇలా దాదాపు ఒకటిన్నర గంట పాటు జరిపిన మాక్‌డ్రిల్ ఇది. భక్తులు బస చేసే అతిథిగృహంలోకి ఉగ్రవాదులే వస్తే ఎలా స్పందించాలనే దానిపై మాక్ డ్రిల్ జరిగింది. దాదాపు 30 మంది అక్టోపస్ సిబ్బంది, 25 మంది విజిలెన్స్, 15 మంది పోలీసులు, 10 మంది ఏపీఎస్పీ సిబ్బంది డ్రిల్‌లో పాల్గొన్నారు.






విశ్రాంతి భవనం ముందున్న ఉగ్రవాదిని అసాల్ట్ డాగ్ ఎనిమీ విధానంలో హతమారుస్తున్న సిబ్బంది - విశ్రాంతి భవనం పైభాగంలో మరో బృందం - ఉగ్రవాదిని హతమార్చుతున్న సిబ్బంది



గాయపడిన భక్తుడిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో త్రిశూలం ప్రతిష్ఠ



త్రిశూలాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, ప్రభావతమ్మ తదితరులు

నాయుడుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలోని ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ త్రిశూలాన్ని ప్రతిష్ఠించారు. ఆలయానికి రాజగోపాల్‌రెడ్డి, విద్యావతి దంపతులు త్రిశూలాన్ని బహూకరించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచి ప్రభావతమ్మ, ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ స్వామి, కమిటీ సభ్యులు అంకయ్య, రాజయ్య, బ్రహ్మయ్య, అధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



సమావేశంలో ప్రజాప్రతినిధులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గురవయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరిచేందుకు, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రాణి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రావు, ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మయూరి శ్యామ్‌యాదవ్

గూడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే విద్యార్థులు చదువులపై శ్రద్ధచూపి రాణించాలని రోటరీక్లబ్ సభ్యుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. గురువారం స్థానిక సరస్వతి శిశు మందిరం పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదవి వాటిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, శ్రీధర్‌రెడ్డి, సోమనాథ్, మురళీనాయుడు, అశోక్‌కుమార్, రమణయ్య, రామమోహన్‌రావు, లలిత, రంగనాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

ఓజిలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఆయా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె కార్యదర్శులతో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి పథకాలను పర్యవేక్షిస్తూ మరమ్మతులకు గురైన వాటిని వెంటనే బాగు చేయాలన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నాయుడుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఉన్న వక్ఫ్‌బోరు చట్టాన్ని సవరించడం అన్యాయమని, తక్షణమే సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లింలు డిమాండు చేశారు. గురువారం వారు పట్టణంలోని జామియా మసీదు నుంచి అంబేడ్కర్ విగ్రహం ర్యాలీ నిర్వహించారు. అక్కడే మానవహారం చేపట్టారు. అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశారు. కాశ్మీరులోని పహల్గామ్‌లో యాత్రికులపై ఉగ్రవాదుల దాడులను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లీ రహంతుల్లా సాహెబ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షరీఫ్, మౌలానా అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే ఎలా!



డక్కిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా సైతం విధిస్తున్నారు. అయినా ప్రజల్లో మార్పురావడంలేదు. గరువారం ఓ ద్విచక్ర వాహనంపై ఆరుగురు ప్రయాణిస్తూ డక్కిలి ఎస్‌ఐ శివశంకర్ కంట పడ్డారు. మండలంలోని కందలవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి తన భార్య, నలుగురు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై ప్రయాణించడం గమనించిన ఎస్‌ఐ వారిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. కనీసం హెల్మెట్ కూడా ధరించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే కేసు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట హోలీక్రాస్ సర్కిల్ వద్ద గురువారం ప్రమాదం జరిగింది. పట్టణంలోని సాయి నగర్‌కు చెందిన రసూల్ మోటారు సైకిల్‌పై వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న మహిళ వేలూరు జ్ఞానమ్మను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

డక్కిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని వెంకటగిరి జనసేన క ఈ్వనర్ జంపాల ప్రకాష్ అన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం ప్రకటించారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాలన్నారు.

నిద్రపోతున్న నిఘా నేత్రాలు... చెలరేగుతున్న చోరులు

వరుస చైన్ స్నాచింగ్‌లతో హడలిపోతున్న మహిళలు ● ఇంటి ముందు ముగ్గు వేయాలన్నా భయమే



మరమ్మతులకు నోచుకోని సీసీ కెమెరా

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) నాయుడుపేట పట్టణంలో నిఘా నేత్రాలు పని చేయడంలేదు. ఇదే అదునుగా చైన్ స్నాచర్లు చెలరేగిపోతున్నారు. ఇళ్ల ముందు ముగ్గులు వేయాలంటే మహిళలు హడలి పోతున్నారు. కొంతకాలంగా పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేకపోవడంతో పాటు పోలీసింగ్ లేకపోవడంతో చైన్ స్నాచింగ్‌లు పెరిగిపోయాయి. పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పోలీసు స్టేషన్‌లో కంట్రోల్ రూంకు అనుసంధానించి పర్యవేక్షించేవారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య క్షణాల్లో పరిష్కారమయ్యేది. అలాగే చోరీలు జరిగిన గంటల వ్యవధిలోనే దొంగలను పోలీసులు పట్టుకునేవారు. అయితే కొంతకాలంగా పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. మరమ్మతులకు గురైన కెమెరాలను బాగు చేయకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఇదే అదునుగా చైన్ స్నాచర్లు తమ తమ చేతివాటం చూపుతూ మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను లాక్కుని పరారవుతున్నారు. గత నెలలో ఓ వృద్ధురాలు ఇంటి ముందు కూర్చుని ఉండగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు చైను లాక్కుని పరారయ్యారు. అలాగే పండ్లూరులో ఓ మహిళ నుంచి బంగారు చైను లాకెళ్లారు. ఈనెల 15వ తేదీన పట్టణంలోని లోతువానిగుంట సమీపంలోని దుకాణానికి నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు చైను లాక్కుని పరారయ్యారు. దీంతో మహిళలు బయట తిరగాలంటే హడలిపోతున్నారు. ఇళ్ల ముందు ముగ్గు వేయాలన్నా భయపడుతున్నారు. పోలీసులు స్పందించి సీసీ కెమెరాలను బాగు చేయడంతో పాటు చైన్ స్నాచింగ్‌లను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు: కలెక్టర్



ఏకొల్లు ఎస్సీ బాలికల వసతి గృహంలో మంచి నీటి తొట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

దొరవారిసత్రం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన దొరవారిసత్రం మండలంలోని ఏకొల్లు ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో మరుగుదొడ్లు, కొళాయిలు, భవనం పెయిటింగ్, కిటికీలు మరమ్మతులు, ఆర్‌వో వాటర్ ప్లాంటు ఏర్పాటు పనులను పరిశీలించారు. పనుల్లో ఇంజనీరింగ్ అధికారి చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు కన్పించడంతో సదరు అధికారిని హెచ్చరించారు. ప్రతి పనిలో నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై విద్యార్థులు పాఠశాలలకు వచ్చేసరికి వసతి గృహం అందంగా కనబడాలన్నారు. అలాగే వసతి గృహంలో శుభ్రత పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడి యాతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని వసతి గృహాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏకొల్లు ఎస్సీ బాలికల వసతి గృహంలో రూ.18.36 లక్షలతో వివిధ పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే ప్రతి విద్యార్థీ మంచి సౌకర్యాల నడుమ చదువుకోవాలన్నది తన లక్ష్యమన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుటే
ప్రభుత్వ భూమి ఆక్రమించారు
కలెక్టర్‌కు ఏకొల్లు గ్రామస్తుల ఫిర్యాదు

దొరవారిసత్రం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయం ఎదుటే జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఏకొల్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహం పరిశీలనకు విచ్చేసిన కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందించారు. ఇళ్ల స్థలాలకు ఇచ్చిన భూమిని ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారని తెలిపారు. అడవిలో నుంచి చెరువులోకి వచ్చే వరవ కాలువను కూడా పూడ్చేశారని మాజీ సర్పంచు కృష్ణమూర్తి, రాఘవయ్య కలెక్టర్‌కు వివరించారు. ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వ్యక్తి కొందరి దగ్గర ఇళ్ల స్థలాలను కొన్నారని తహసీల్దారు శైలాకుమారి చెప్పడంతో, మిగిలిన భూమిని గతంలో పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు చెందేలా చూడాలని, అలాగే కాలువ ఆక్రమణను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.

షార్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, ముఖ్య అతిథి సుధాకర్ నాయక్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. శ్రీహరికోటలోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను ముంబాయికి చెందిన ఐఆర్‌ఎస్ జాయింట్ కమిషనర్ డాక్టర్ సుధాకర్ నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్‌ఏ డీడీ గోపికృష్ణ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడి దుర్మరణం



సురేంద్రబాబు(ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట హోలీక్రాస్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాంలో అపాచీ పరిశ్రమ కార్మికుడు మాయారి సురేంద్రబాబు(35) దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... దొరవారి సత్రం మండలం మోదుగులపాలెం గ్రామానికి చెందిన సురేంద్రబాబు తడ మండలం మాంబట్టు పారిశ్రామిక వాడలోని అపాచీ పరిశ్రమలో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి వద్ద నుంచి మోటరు సైకిల్ కంపెనీకి వెళ్లేందుకు బయలుదేరాడు. సూళ్లూరుపేట హోలీక్రాస్ సర్కిల్ వద్ద వెళ్తుండగా కార్మికులను తీసుకెళ్తున్న అపాచీ పరిశ్రమ అకస్మాత్తుగా ఆగడంతో సురేంద్రబాబు బైక్ ఆపారు. ఇంతలో వెనుక వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు, లారీ మధ్య ఇరుక్కుపోయిన సురేంద్రబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



కొత్తచెరువు గ్రామంలో రీ సర్వే సందర్భంగా రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కొత్తచెరువు గ్రామంలో జరుగుతున్న భూముల రిసర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా పరిష్కారానికి నోచుకోని భూ వివాదాలు రీ సర్వేతో సమసి పోతాయన్నారు. రీ సర్వే పక్కాగా నిర్వహించాలని సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి ఖచ్చితమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. రీ సర్వే ద్వారా మ్యుటేషన్లు, వెబ్‌ల్యాడ్ కరక్షన్, సరిహద్దు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

ఇకూరుపాడులో రీసర్వే ప్రారంభం

కోట: మండల పరిధిలోని సిద్దవరం పంచాయతీ ఇకూరుపాడులో భూముల రీసర్వే ప్రారంభమైంది. గ్రామంలో ఉన్న 339 ఎకరాల భూముల రీసర్వే చేసేందుకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో పలుపంచాయతీల వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీడీవో పదోన్నతుల్ల ఈవోపీఆర్‌డీలకు 60శాతం, ఏవోలకు 30శాతం ఇవ్వడం అన్యాయమన్నారు. ఇతర సిబ్బందికి కూడా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది గజేంద్రబాబు, రమణయ్య, చంద్రమౌళి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, డీఎల్‌పీవో రవీంద్రబాబు, వీవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏపీవో లక్ష్మీనారాయణ, పీఆర్ ఏఈ నందకిషోర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పహల్గాం యాత్రికులపై దాడి దారుణం



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

కోట, ఏప్రిల్ 24: కశ్మీర్‌లోని పహల్గాం వద్ద యాత్రికులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ గురువారం విద్యానగర్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గాంధీబొమ్మ సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పర్యాటక ప్రాంతంలో ప్రకృతి అందాలను తిలకిస్తూ సంతోషంగా గడుపుతున్న పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి 26మందిని చంపడం దారుణమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, సైన్స్ అండ్ హ్యూమనిటీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు మాధవయ్య, మల్లిఖార్జునరెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను ఏబీవీపీ నాయకులు దహనం చేశారు. కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చందు, వినయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో సబ్ కలెక్టర్ పర్యటన



శ్రీనివాసపత్రంలో భూముల వివరాలను అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

కోట, ఏప్రిల్ 24: మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో గురువారం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పర్యటించారు. పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపత్రం, గున్నంపడియ, యమదిన్నెపాళెం గ్రామాల్లో చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్‌లో భూములు కోల్పోయే రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో భూసర్వేను పరిశీలించారు. ప్రభుత్వ భూములు, ఆక్రమణదారుల వివరాలతో నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ జయజయరావును ఆదేశించారు. ఆయన వెంట మండల సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్‌వో వెంకటేశ్వర్లు ఉన్నారు.

పూలతోట మాజీ సర్పంచ్ మృతి



బాలయ్య(ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పూలతోట మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నేత కొణతం బాలయ్య(75) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మధ్యాహ్నం ఇంటి వద్దనే తుదిశ్వాస విడిచారు. బాలయ్య మాజీ మంత్రి పరసారత్నం సమీప బంధువు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నారు.

సీపీఐ నేతకు పరామర్శ

గూడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా ఇటీవల అనారోగ్య కారణంగా చెన్నైలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, ఇతర నాయకులు కాలేషాను ఆయన నివాసంలో పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, రమేష్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు బైక్ నడిపితే సీజ్ చేస్తాం

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మైనర్లు బైక్ నడిపితే వాహనం సీజ్ చేస్తామని సీఐ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు అన్నారు. గురువారం స్థానిక క్రాస్ రోడ్డు, పాలకేంద్రం సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లొద్దు



చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

డక్కిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలు సరదాగా బావులు, చెరువులు, గుంటల్లో ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోవద్దని ఎస్‌ఐ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన చెరువులు వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. వేసవి సెలవుల్లో పిల్లలు సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన ఘటనల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలన్నారు.

కోట: వేసవిలో సెలవుల్లో చెరువుల్లో ఈతకు వెళ్లరాదంటూ మండలంలోని పెన్నక్కచెరువు, కొండుగుంట, చిట్టేడు, తిమ్మానాయుడుపాళెం, చంద్రశేఖరపురం చెరువుల్లో ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

వేసవి శిక్షణా శిబిరం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యశోద నగర్‌లో ఉన్న వేమన విజ్ఞాన కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 28 నుంచి మే 7వ తేదీ వరకు డ్రాయింగ్, మ్యాథ్స్, 8 నుంచి 21వ తేదీ వరకు కథలు, పాటలు, గుండ్రటి చేతిరాత, 22 నుంచి 31వ తేదీ వరకు చెస్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిక్షణ ఉంటుంది. మే 1 నుంచి 31వ తేదీ వరకు కర్రసాము, మే 1 నుంచి 6 నెలల పాటు క్లాసికల్ డ్యాన్స్‌పై ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుంది. పూర్తి వివరాలకు 8985080370, 9398000686 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

టీటీడీ ఉద్యోగుల పిల్లలకు క్రికెట్ శిక్షణ

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగుల పిల్లలకు, టీటీడీ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 27నుంచి జూన్ ఒకటో తేదీ వరకు క్రికెట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ఉంటుంది. వివరాలకు 9989033100, 9652988727, 7382059520 నంబర్లను సంప్రదించాలి.

పుత్తూరు వార్తలు

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వడమాలపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపరాదని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. గురువారం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రజల అవసరాల మేరకే అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. జడ్పీటీసీ సభ్యులు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఎస్బీఆర్ పురం రోడ్డుకిరువైపులా చెట్లకు నీళ్ల పోయడానికి ఉపాధి సిబ్బంది సహకరించడం లేదని సర్పంచ్ మణిరాజు ఆరోపించారు. మండలంలో 59 నీటి తొట్టిలు నిర్వహిస్తున్నామని, గ్రామాల్లో నీటిసమస్య లేదని గ్రామీణ నీటిసరఫరా అధికారి రామ్మోహన్ చెప్పారు. గ్రామాల్లో డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీరు అక్రమ కనెక్షన్‌లపై పంచాయతీ కార్యదర్శులు దృష్టిసారించాలని కోరారు. వ్యవసాయ పనిముట్లు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. చేయూత రుణాల కోసం లబ్ధిదారుల జాబితాను బ్యాంకులకు పంపామని ఎంపీడీవో శేషగిరిరావు తెలియజేశారు.

బొజ్జనెత్తం సమస్యలు పరిష్కరించండి

● మున్సిపల్ కమిషనర్‌కు బొజ్జనెత్తం ఎస్టీ కాలనీ వాసుల వినతి



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు బొజ్జనెత్తం ఎస్టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌కు గురువారం స్థానికులు వినతి పత్రం అందజేశారు. 20 సంవత్సరాలుగా బొజ్జనెత్తం ఎస్టీ కాలనీకి సిమెంటు రోడ్డు లేదని తెలియజేశారు. రోడ్డు గుంతలుగా ఉండటంతో వృద్ధులు, గర్భిణులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దోమల బెడద ఎక్కువగా ఉందని ఫాగింగ్ చేయాలని కోరారు. తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం


టైలరింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్, పక్కన మున్సిపల్ కమిషనర్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక పురోగతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతరంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గేటు పుత్తూరులోని జెడ్పీ హైస్కూలులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని కమిషనర్ మంజునాథ్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే నివాళులు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకపురం ఎస్టీ కాలనీలో ఇటీవల మృతిచెందిన టీడీపీ సీనియర్ నాయకులు ధర్మయ్యకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంతాపం తెలియజేశారు. గురువారం జరిగిన ధర్మయ్య కర్మక్రియల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.

నేడు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంపు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శుక్రవారం కస్టమర్ సర్వీస్ క్యాంపు నిర్వహించనున్నట్లు డీఈ ఎం.ఎస్. చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిగ్నల్‌తో పాటు ఫైబర్ నెట్ కనెక్షన్ సమస్యల పరిష్కారానికి క్యాంపు నిర్వహిస్తున్నామని వివరించారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం స్వాధీనం.. మహిళపై కేసు నమోదు

వడమాలపేట, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ మాల వడ్డిపల్లి, ఆది ఆంధ్రవాడల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సుబ్బమ్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి: ఎంపీడీవో

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో రమేష్‌బాబు సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మునివేలమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలోని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్‌లను గురువారం నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వైస్ చైర్మన్‌గా వడమాలపేట మండలం కాయంకు చెందిన లీలావతి నియమితులయ్యారు. డైరెక్టర్లుగా వడమాలపేట మండలం తిరుమండ్యంకు చెందిన సౌజన్య, ఎస్బీఆర్ పురానికి చెందిన శ్రీదేవి, టీసీ అగ్రహారానికి చెందిన దాము, పుత్తూరు మండలానికి చెందిన రమేష్, సుజాత, అమరనాథ్, మేమలత, ఉమాశంకర్‌రెడ్డి, సత్య, అమరావతి, బాబునాయుడు, గోపాల్, మహేష్ నియమితులయ్యారు. వీరికి పలువురు అభినందనలు తెలియజేశారు. తమ పట్ల నమ్మకం ఉంచి పదవులు ఇప్పించిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా డీఎస్ గణేష్‌ను ఇటీవలే నియమించిన విషయం తెలిసిందే.

'మా పాఠశాలను విలీనం చేయొద్దు'


నిరసన తెలుపుతున్న గొల్లవారిపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

సత్యవేడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లవారిపాళెం ప్రాథమిక పాఠశాలను విలీనం చేయవద్దని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. మల్లవారిపాళెం ఈస్ట్ పంచాయతీ గొల్లవారిపాళెం ప్రాథమిక పాఠశాలలో గొల్లవారిపాళెం, అప్పయ్యపాళెం గ్రామాలకు చెందిన సుమారు 20 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతులను సమీపంలోని చెరివి ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసేందుకు విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. దీంతో విలీన ప్రక్రియను ఆపాలని విద్యార్థుల తల్లి తండ్రులు, గ్రామస్తులు సర్పంచ్ సన్యాసయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని పాఠశాలను రెండు కిలో మీటర్ల అవతల ఉన్న పాఠశాలలో విలీనం చేయాలన్న నిర్ణయం సరైంది కాదన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

వరదయ్యపాళెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సత్యవేడులోని దాస్ కళాశాలలో శుక్రవారం జరిగే ఉద్యోగమేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఈ ఉద్యోగ మేళా ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురు దక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ చేశారు. వినాయక పూజ చేశారు. తర్వాత అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ గతంలో చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా శ్రీకాళహస్తిలో నాటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అధ్వర్యంలో పెట్టిన అక్రమ కేసులకు సంబంధించి గురువారం టీడీపీ నాయకులు కోర్టుకు హాజరయ్యారు. కోర్టుకు హాజరైన వారిలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, క్లస్టర్ ఇన్‌చార్జి కంఠా రమేష్, టీసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజాయాదవ్, పట్టణ యువత అధ్యక్షుడు కిట్టు ఉన్నారు.

పశువుల షెడ్ల మంజూరుపై విచారణ చేపట్టండి

● ఎంపీడీవోకు ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువుల షెడ్ల మంజూరులో అక్రమాలపై విచారణ చేపట్టాలని ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, ఎంపీటీసీలు రవి, వైసీపీ మాజీ కన్వీనర్ విద్యానాథరెడ్డి గురువారం ఎంపీడీవో త్రివిక్రమ్‌రావును కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల ఉన్న వారికి షెడ్లు మంజూరు చేయాలని నిబంధనలు ఉన్నా అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి పశువులు లేనివారికి షెడ్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, మునిరాజా, భాస్కరయ్య, శంకరయ్య, బాలాజీ, గిరిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

వడమాలపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీసీ అగ్రహారానికి చెందిన నరేంద్రపై వరకట్నం, వేధింపుల కేసు నమోదైంది. నరేంద్ర భార్య పూజిత కథనం మేరకు.. రేణిగుంట మండలం, గాజులమద్యం నల్లపాళ్యంకు చెందిన పూజితకు, టీసీ అగ్రహారానికి చెందిన నరేంద్రకు 2022లో వివాహమైంది. టీసీ అగ్రహారంలో కాపురం పెట్టారు. భర్త తరచూ మద్యం సేవించేవాడు. అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ధర్మారెడ్డి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు గాయపడ్డారు. తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెంకు చెందిన ఎల్లయ్య(57), ఈశ్వరయ్య(35) దినసరి కూలీలు. ఇద్దరు ద్విచక్ర వాహనంపై గురువారం సొంతమపనుల నిమిత్తం గ్రామ సమీపంలోని చెన్నై రహదారి కూడలి వద్దకు వచ్చారు. పనులు ముగించుకుని రోడ్డు దాటే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎల్లయ్యను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

పన్ను చెల్లింపు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వీవీఆర్ గ్రూప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను పురపాలక సంఘానికి రూ.9,47,309 పన్ను చెల్లించారు. ఈ సందర్భంగా గ్రూప్ డైరెక్టర్ జనార్ధన్ పవార్ మాట్లాడు తూ ప్రతి సంవత్సరంలాగే స్థిరాస్తి, నీటి పన్నులు ముందస్తు రాయితీలో చెల్లించామన్నారు. డైరెక్టర్లు మధు పవార్, మహేశ్వరరావు, బిల్ కలెక్టర్ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి అశ్రునివాళులు




శ్రీకాళహస్తిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టీడీపీ, బీజేపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు. గురువారం రాత్రి అంబేద్కర్ కూడలి వద్ద కొవ్వొత్తులతో టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. ఇలాంటి హింసాత్మక ఘటనలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇక వైసీపీ ఆధ్వర్యంలో ఏపీసీడ్స్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, నాయకులు సురేష్, పఠాన్ ఫరీద్, సాధన మున్నార రాయల్, కంఠా ఉదయ్, సిరాజ్‌బాషా, శరవణకుమార్,


వరదయ్యపాళెంలో కొవ్వొత్తులతో నివాళి

శ్రీనివాస్‌రెడ్డి, హరినాథ్‌నాయుడు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నాలుగు మాడవీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, నాయకులు కండ్రిగ ఉమ, సుబ్రమణ్యంరెడ్డి, ఎన్వీ రమణ, కొండేటిగోపాల్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: స్థానిక బస్టాండు కూడలి నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు పలువురు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భారతి, మునిభూషణమ్మ, చిన్నిరాజు, సిద్ధులయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, రవిరెడ్డి, గుత్తి త్యాగరాజు, శేఖర్, సాగర్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసమే పంచాయతీరాజ్ వ్యవస్థ


జాతీయ నాయకులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీవో

నారాయణవనం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ వ్యవస్థ వల్ల గ్రామాల అభివృద్ధి జరుగుతోందని ఎంపీడీవో శేఖర్, జడ్పీటీసీ సుమన్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు, ఈవోపీఆర్‌డీ వేణయ్య,ఏఈ నరేష్, ఈవో షణ్ముగం, కార్యదర్శులు సుజన, కిషోర్‌కుమార్, నాయకులు పొన్నుస్వామి, సుధాబాబు, రమేష్, సొరకాయలు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీవో రాధారాణి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ రాజేంద్రప్రసాద్, పీఆర్ ఏఈ ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ నంద కుమార్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఈవో బసిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు నాగేంద్ర, సుజిత, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబరు ముని భూషణమ్మ, బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు పురుషోత్తం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్‌కు బహుమతి ప్రదానం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్వీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరంలో 981 మార్కులు సాధించిన మండల టాపర్‌కి చిన్నపాలేడు గ్రామానికి చెందిన విశ్రాంత ఎస్సీ రమేష్‌నాయుడు, శేఖర్‌నాయుడు, బీఎన్ కండ్రిగకు చెందిన రవినాయుడులు రూ.15వేలు నగదును అందజేశారు. గురువారం ఎస్వీఆర్ కళాశాలలో ఎంఈవో-2 మునిసుబ్రమణ్యం చేతులు మీదుగా విద్యార్థిని తల్లి దండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సురేష్ నాయుడు, ఉపాధ్యాయులు సురేంద్ర, రామచంద్రయ్య, టీడీపీ నాయకుడు మునెయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలి


మృతులకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాక్ ప్రేరిపిత ఉగ్రవాదాన్ని అంతం చేయాలని టీడీపీ బీసీ విభాగం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పూసలవీధి కూడలిలో పహల్గామ్ ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. రాష్ట్రానికి చెరందిన చంద్రమౌళి, మధుసూదన్‌రావు చిత్రపటాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘం డైరెక్టర్ మిన్నల రవి, బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు, నాయకులు లక్కమనేని మధు, పేట బాలాజీరెడ్డి, రాజేంద్రప్రసాద్, కోట చంద్రశేఖర్, దొరైరాజ్‌రెడ్డి, మునిరాజాయాదవ్, సయ్యద్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

రేణిగుంట, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 19 పంచాయతీల్లో పారిశుధ్యంపై దృష్టిసారించాలని డిప్యూటీ ఎంపీడీవో ప్రభురావు సూచించారు. గురువారం మండల పరిధిలోని 19 పంచాయితీల్లో జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభలు నిర్వహించారు. కరకంబాడిలో జరిగిన గ్రామ సభలో డిప్యూటీ ఎంపీడీవో ప్రభురావు మాట్లాడారు.

యువకుడిపై పోక్సో కేసు

పిచ్చాటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎస్‌బీ పేట దళితవాడకు చెందిన పార్థీబన్(25) మండలానికి చెందిన ఓ బాలికను ప్రేమపేరుతో మోసం చేశాడు. బాధితురాలి తల్లిండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశులు పోక్సో కేసు నమోదు చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల సంఖ్యను పెంచాలి

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గానికి కేటాయించిన ఎస్సీ కార్పొరేషన్ రుణాల సంఖ్యను పెంచాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెన్నయ్యను ఎమ్మెల్యే ఆదిమూలం తిరుపతిలో గురువారం కోరారు.

కాటూరు పాఠశాల విలీనం ఆపేయాలని డీఈవోకు వినతి


డీఈవోకు సమస్యను వివరిస్తున్న గిరీష్ యాదవ్

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు ప్రాథమి కోన్నత పాఠశాల విలీనం నిలిపివేయాలని జిల్లా విద్యా శాఖాధికారి కుమార్‌కు మండల మాజీ ఎంపీపీ కుమారుడు బట్టా గిరీష్ యాదవ్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటూరు పాఠశాలను గ్రామానికి చెందిన కిరణ్ రెడ్డి దత్తత తీసుకుని సుందరంగా తీర్చిదిద్దారని తెలిపారు. ప్రస్తుతం తమ పాఠశాలను ఉన్నత పాఠశాలగా ఏర్పాట్లు చేసుకుంటే 6, 7, 8 తరగతులను పల్లమాల ఉన్నత పాఠ శాలలో విలీనం చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరత్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆటో నడుపు కుంటూ జీవనం సాగించే శరత్ (33) అనే యువ కుడిపై గుర్తు యువకులు కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం రాత్రి ఏర్పేడు మండలంలోని గోవింద వరం డంపింగ్ యార్డు వద్ద జరిగింది. గోవిందరవం గ్రామానికి చెందిన శరత్ ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇదే గ్రామ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద గురువారం రాత్రి కొందరు యువకులు మద్యం సేవించారు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ ఆటోడ్రైవర్‌పై కొందరు యువకులు హత్యాయత్నానికి పాల్పడి పరారయ్యారు. స్థానికులు గుర్తించి అతడిని చికిత్స నిమిత్తం కరకంబాడి వద్ద ఉన్న ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

దేవుడి పేరుతో దోపిడీ..!

● అవదూత సొరకాయల స్వామి ఆలయ ట్రస్ట్ పేరుతో అక్రమాలు
● ట్రస్ట్ నిర్వహణపై ఆర్టీఐ ద్వారా వివరాలు కోరిన జడ్పీటీసీ


ఎంపీడీవో శేఖర్‌కు ఆర్టీఐ నకలును అందిస్తున్న జడ్పీటీసీ


(ఇన్‌సెట్లో)అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం

నారాయణవనం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దేవుడి పేరుతో దోపిడీ తగదని, అవదూత సొరకాయల స్వామి ఆలయంలో ట్రస్ట్ పేరుతో అక్రమాలు జరుగుతున్నాయని జడ్పీటీసీ సుమన్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ట్రస్ట్ కార్యకలాపాలపై సమాచార హక్కు చట్టం ద్వారా పలు వివరాలు కోరుతూ దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో శేఖర్, ఈవోపీఆర్డీ డాక్టర్ వేణయ్య, పంచాయతీ ఈవో కేపీ షణ్ముగం తదితరులకు దరఖాస్తు నకలును గురువారం అందజేశారు. అందులో ట్రస్ట్ రిజిస్ట్రేషన్, ఆశయాలు, అన్నదాన కమిటీ రిజిస్ట్రేషన్ నెంబర్, ట్రస్టుకు సంబంధించిన ఆస్తుల వివరాలు, ఆలయ సత్రాలు, వసతి గృహాల వివరాలు, పన్నుల నివేదిక, వసతి గృహాలకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్, అన్నదాన కమిటీ సేవింగ్స్ బ్యాంకు ఖాతా లావాదేవీల వివరాలు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొరకాయలస్వామి ఆలయంలో అనాధికారికంగా కొంతమంది ట్రస్ట్ పేరుతో భక్తులు, దాతలు అందించే విరాళాలను దోచుకుంటున్నారని ఆరోపించారు. భక్తుల విరాళాల ద్వారా నిర్మించిన కల్యాణ మండపానికి, ఏసీలు కలిగి ఉన్న మరో 10 రూములను అద్దెకు ఇచ్చి వాటి ద్వారా నెలకు వేల రూపాయలు దోచుకుంటున్నారని విమర్శించారు. పంచాయతీ అప్రూవల్ లేకుండా ఆలయం పేరుతో మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఆలయ ట్రస్ట్‌పై చర్యలు తీసుకుని, పేదలకు న్యాయం చేయాలని, దీనిపై పూర్తి సమాచారం కోసం ఆర్టీఐ కింద దరఖాస్తు చేశామని చెప్పారు. ఆయనతో పాటు నాయకులు లక్ష్మణ్, సుధాబాబు, మెహిద్దీన్, మోహన్, రవిరెడ్డి, కుమార్, రమేష్ ఉన్నారు.